టార్గెట్ చేరని సింగరేణి

- లక్ష్యానికి 3 మిలియన్ టన్నులు వెనుకంజ
- 72 మిలియన్ టన్నుల లక్ష్యానికి కేవలం 69 మిలియన్ టన్నుల ఉత్పత్తి
- టార్గెట్‌ను అధిగమించింది నాలుగు ఏరియాలే

గోదావరిఖని, ఏప్రిల్ 1: సింగరేణి సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరంలో మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకబడి టార్గెట్ చేరుకోలేకపోయింది. 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిన సింగరేణి సంస్థ మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 69 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి ఈ ఆర్థిక సంవత్సరంలో మరో మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గి 69 మిలియన్ టన్నులకే పరిమితమైంది. అంతక్రితం సాధించిన బొగ్గు ఉత్పత్తి కన్నా తక్కువ జరుగడంతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు నికర లాభాలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి ఎంతగానో కృషి చేసింది. గత నెలలో రికార్డు స్థాయిలో 8.91 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 116శాతం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. సింగరేణి సంస్థలో 11 ఏరియాలకు గాను కేవలం నాలుగు డివిజన్లు మాత్రమే నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధ్యమయ్యాయి. ఇల్లందు ఏరియాలో 104శాతం), రామగుండం డివిజన్ 3 ఏరియా 104శాతం, రామగుండం డివిజన్–1 వంద శాతం, మణుగూరు డివిజన్ లో 100 శాతం సాధించినట్లు సింగరేణి వర్గాలు వెల్లడించాయి. మిగితా ఏరియాల్లో సింగరేణి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలు సాధ్యం కాలేదు. ఈ కారాణంగానే 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి వెనుకబడిపోయింది. సింగరేణిలో 2025 జనవరి నుంచి మార్చి వరకు కార్మికులకు ఉత్పత్తితో కూడిన ప్రోత్సాహక బహుమతులు ప్రకటించడంతో మూడు నెలల్లో భారీ బొగ్గు ఉత్పత్తి జరిగింది.

2025-26లో 76మిలియన్ టన్నుల భారీ టార్గెట్

సింగరేణి సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల భారీ బొగ్గు ఉత్పత్తి టార్గెట్‌ను నిర్దేశించుకుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తితో పాటు కొత్తగా మరో రెండు గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి జరిగే అవకాశాలతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో 76మిలియన్ టన్నుల భారీ బొగ్గు ఉత్పత్తిని సాధించేందుకు సింగరేణి సంస్థ ముందుకు సాగుతుంది.

100శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించిన ఆర్జీ-1

రామగుండం డివిజన్ 1లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 100శాతం బొగ్గు ఉత్పత్తితో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించినట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25లో 49,64,514టన్నులు(100.5శాతం) సాధించినట్లు స్పష్టం చేశారు. మార్చిలో ఆర్జీ–1 ఏరియాలోని రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి 7,42,748 టన్నులు(160శాతం) సాధించడంతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించినట్లు పేర్కొన్నారు. గత నెలలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు 5లో 6,36,099 (190శాతం) సాధించడం రికార్డుగా ఉందన్నారు. గోదావరిఖని లోని గాంధీ మార్కెట్ ఏరియాలో సింగరేణి సంస్థకు చెందిన రూ. 17కోట్ల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గోదావరి తీరం వద్ద సమ్మక్క–సారక్క గద్దెల సమీపంలో పర్యాటక ప్రాంతాన్ని అభి వృద్ధి చేయడానికి నిర్ణయించి పనులు ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. ఇక్కడ ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజి నీర్ వెంకటేశ్వర్ రావు, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ప్రాజెక్టు అధి కారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్జీ-2లో 99 శాతం వార్షిక బొగ్గు ఉత్పత్తి

యైటింక్లయిన్ కాలనీ, ఏప్రిల్ 1: సింగరేణి ఆర్జీ–2 ఏరియాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 99 శాతం వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం బీ.వెంకటయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వార్షిక ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. గడిచిన ఏడాది 97.77 లక్షల టన్నులతో 99 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. 55.70 లక్షల క్యూబిక్ మీటర్లు ఓబీ వెలికితీసి 76 శాతం నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఓసీపీ–3 సీహెచ్‌పీ నుంచి 86,73,922 టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇంజనీర్ నరసింహన్, ఎస్ఓటు జీఎం రాముడు, డీజీఎం అనిల్‌కుమార్, మురళీకృష్ణ, ధనుంజయ, వెంకటరమాచంద్ర, ఎస్ఓ షరీఫ్ మహ్మద్ తదితరులున్నారు.

ఆర్జీ-3లో 104శాతం

రామగిరి, ఏప్రిల్ 1: 2024–25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆర్జీ–3 ఏరియాలో గణనీయంగా బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం నరేంద్ర సుధాకర్ రావు వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ–3 65.11 (104 శాతం) లక్షల టన్నుల బొగ్గు వెలికితీసినట్లు తెలిపారు. అలాగే 389.52 లక్షల క్యూబిక్ మీటర్లు (78శాతం) ఓబీ వెలికితీసినట్లు తెలిపారు. 78.11 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు వివరించారు. మార్చిలో 9.54 లక్షల టన్నులు (157 శాతం) బొగ్గు ఉత్పత్తితో రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. గత నెలలో 39.40 లక్షల క్యూబిక్ మీటర్లు (97శాతం) ఓబీ వెలికితీసినట్లు తెలిపారు. 7.75 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. మార్చిలో ఓసీపీ–1 గనికి 5.79 లక్షల టన్నులతో 177 శాతం, ఓసీపీ–2లో 3.75 లక్షల టన్నులతో 134 శాతం ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. ఇందుకు కృషి చేసిన ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

ఏపీఏ ఏరియాలో 4.10 లక్షల టన్నులు

ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్‌వాల్ గనికి గడిచిన ఆర్థిక సంవత్సరంలో 4.10 లక్షల టన్నులతో 79శాతం ఉత్పత్తితోపాటు 3.72 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. గత నెలలో 0.15 లక్షల టన్నులతో 12 శాతం ఉత్పత్తి, 0.03 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారికి సన్మానం

గోదావరిఖని, ఏప్రిల్ 1: కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ప్రధాన దవాఖానలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌ను ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ సన్మానించారు. ఈ మేరకు మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయనను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ప్రమోషన్‌పై వెళ్తున్న మేనేజర్ డీ రమేశ్‌ను కూడా సన్మానించారు. ఇక్కడ ఎస్‌వోటు జీఎం గోపాల్‌సింగ్, పీవో చంద్రశేఖర్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, ఇతర అధికారులు శివ నిరాయణ, సాయిప్రసాద్, ఆంజనేయ ప్రసాద్, జితేందర్‌సింగ్, ధనలక్ష్మీ బాయి, రవీందర్‌రెడ్డి, భీమా, బ్రహ్మజీ, వరప్రసాద్, లక్ష్మీరాజం, కుమారస్వామి, శ్రావణ్ కుమార్, హన్మంతరావు ఉన్నారు.

ఎస్‌వోటూ జీఎంకు ఆత్మీయ సన్మానం

రామగిరి, ఏప్రిల్ 1:ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో ఎస్‌వోటూ జీఎంగా పని చేసి ప్రమోషన్ ద్వారా బదిలీపై వెళ్తున్న రఘుపతిని ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు సన్మానించారు. ఈమేరకు జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయనకు వీడ్కోలు పలికారు. కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎంగా పదోన్నతి పొందినందుకు గానూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ శేఖర్‌బాబు, ఏజీఎం శ్రీనివాసులు, అధికారులు వెంకటరమణ, రాజశేఖర్, సత్యనారాయణ, రాజేంద్రకుమార్ ఉన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న మంత్రి

మాట్లాడుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

- శ్రీధర్‌బాబు బంధువుల భూములకు రేట్లు రావడానికే గోదావరిపై వంతెన నిర్మాణం
- ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలకు ప్రయోజనం
- బంధువుల గురించే మంథని ఎమ్మెల్యే ఆలోచన
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 1: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ. 300 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మంథనిలోని గోదావరి తీరంలో నూతనంగా నిర్మించనున్న వంతెన స్థలం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ. 300 కోట్లతో మంచిర్యాల జిల్లా శివ్వారం నుంచి మంథని గోదావరిపై వంతెన నిర్మాణ పనులు చేపట్టనున్నారన్నారు. ఇందులో రూ. 125 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, రూ. 164 కోట్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో పాటు మరికొన్ని నిధులు భూనిర్వాసితుల కోసం కేటాయించారని పేర్కొన్నారు. ఇంత ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మిస్తున్న ఈ వంతెన నిర్మాణంతో మంథని, మంచిర్యాల జిల్లాలోని ప్రజకు ఎలాంటి లేకుండా పోతున్నదని పేర్కొన్నారు. ఈ వంతెన రహదారికి ఎక్కడ కూడా హైవేకు అనుసంధాం కావడం లేదని, శివ్వారం గ్రామానికి మాత్రమే చేరుకుంటుందన్నారు. శివ్వారం నుంచి చెన్నూరుకు వెళ్లాలంటే సుమారు 20కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. చెన్నూరు, మంథనికి ఎప్పుడు కూడా వ్యాపార సంబంధిత రాకపోకలు లేవన్నారు. ప్రజలకు ఈ వంతెనతో కలిగే లాభం ఏముంటుందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిరిపురం బ్యారేజీ వద్ద వంతెన నిర్మించామని, ప్రస్తుతం ఆ వంతెన మీద నుంచి రాక పోకలు కొనసాగుతున్నాయన్నారు. సిరిపురం వంతెన నుంచి వెళ్లినా, తాజాగా నిర్మించబోయే వంతెన మీద నుంచి వెళ్లిన ఒకే దగ్గరికి చేరుతారన్నారు. కేవలం 10 కిలో మీటర్లు మాత్రమే తగ్గుతుందని, ఇందుకోసం రూ. 300 కోట్ల ప్రజాధనాన్ని వినియోగిస్తారా అని ప్రశ్నించారు. గోదావరి వద్ద నిర్మించే వంతెనతో కేవలం మంత్రి బంధువులైన సీఎల్ రాజంతో పాటు మరికొంత మంది భూములకు ధరలకు పెరుగుతాయన్నారు. సీఎల్ రాజంకు మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచీరాజ్‌పల్లిలో 50 ఎకరాల భూమి ఉందని, ఆ భూమికి దగ్గర బ్రిడ్జి రోడ్డును మ్యాప్ చేశారని ఆరోపించారు. దీంతో సీఎల్.రాజం భూములకు డిమాండ్ వస్తుందన్నారు. వేలాలో మంత్రి బంధువుల భూములకు కూడా ధరలు వచ్చేందుకు మాత్రమే ఈ వంతెన నిర్మిస్తున్నారని ఆరోపించారు. మంథని నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేకూరాలంటే ఆరెంద మానేరుపై వంతెన నిర్మించాలన్నారు. గతంలో తాము ప్రతిపాదనలు చేశామని గుర్తు చేశారు. అడవిసోమన్‌పల్లి మానేరుపై మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు నిర్మించిన వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆ వంతెన కూలిపోతే మంథని, కాటారానికి పూర్తిగా రాక పోకలు నిలిచి పోతాయన్నారు. అడవిసోమన్‌పల్లి మానేరుపై నూతన వంతెన నిర్మించడంతో పాటు ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మిస్తే నియోజకవర్గ ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. మంథని మున్సిపాలిటీలోని బోయినిపేట, గొల్లగూడెం, కూచీరాజ్‌పల్లి వాసులకు మేలు జరిగేలా రింగ్ రోడ్డు నిర్మించాలన్నారు. 40 ఏండ్లుగా అధికారం అప్పగిస్తున్న ప్రజల గురించి కాకుండా బంధువుల గురించి మంత్రి ఆలోచించడం బాధకరమన్నారు. మంత్రి కేవలం తన బంధువుల భూముల ధరలు పెంచేందుకే ఈ వంతెన నిర్మాణాన్ని చేపడుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఏగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్ లాల్, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, కాయితి సమ్మయ్య, ఆకుల రాజబాపు, గొబ్బూరి వంశీ, వేల్పుల గట్టయ్య, ఆసిఫ్, సమ్మయ్య పాల్గొన్నారు.

చెరువు నుంచి నీటిని తోడేస్తున్న దుండగులు

తూము గేట్లను మూస్తున్న రైతులు

- నీటిమట్టం తగ్గడంతో రైతుల ఆందోళన
- చెరువు వద్ద అన్నదాతల నిరసన

ముత్తారం, ఏప్రిల్ 1: ఓ పక్క నీళ్లు లేక పొలాలు ఎండుతుంటే మరో పక్క చెరువులో ఉన్న నీటిని గుర్తు తెలియని వ్యక్తులు విడుదల చేస్తున్నారు. పారుపల్లి పెద్ద చెరువు నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రెండు తూముల వద్ద ఉన్న గేట్లను పూర్తిగా తీసి రాత్రికి రాత్రే నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పది రోజుల క్రితం ఇలాగే నీటిని విడుదల చేయడంతో గమనించిన రైతులు అక్కడి కాపలాదారుడిని అడిగితే తాను తూము గేట్లు తీయలేదని తెలిపాడని అన్నారు. నీరు వృథా కాకుండా తూము గేట్లను అవసరం నిమిత్తం తెరిచి వెళ్లామని రైతులు అన్నారు. మంగళవారం ఉదయం మళ్లీ నీళ్ల ఎక్కువగా రావడంతో అక్కడికి సుమారు 15 మంది రైతులు వెళ్లి చూడగా తూము గేట్లు మొత్తం తీసి ఉన్నాయని అన్నారు. వెంటనే కాపలాదారుడిని తీసుకవచ్చి మళ్లీ గేట్లను మూసి వేశారు. ఎవరో కావాలని చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంకా కొందరి పొలాలు పొట్ట దశలోనే ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది నీటి మట్టం తగ్గడంతో చెరువు నుంచి కరెంటు మోటర్లు కిరాయి తెచ్చి పంటను కాపాడుకున్నామని మళ్లీ అదే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీటిని విడుదల చేస్తే మానేరులో నీటి మట్టం పెరిగి అక్కడి బోర్లు నడిచే అవకాశం ఉందన్నారు. మానేరు శివారు ప్రాంత రైతులు తీశారా లేక చెరువులో చేపల పెంపకం చేపడుతున్న కాంట్రాక్టర్ తీస్తున్నాడా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. అధికారులు స్పందించి నీటి దొంగలను పట్టుకొని చర్యలు తీసుకోవాలని, చేతికొచ్చిన పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

11.95 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

- ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో ఉదయ్ రాజహంస

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 1: 2024–25 ఆర్థిక సంవత్సరంలో రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలకు 11.95 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు ఆర్ఎఫ్‌సీఎల్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఉదయ్ రాజహంస మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు 4,68,954 .76 మెట్రిక్ టన్నులు, ఏపీ1,78,363. 39 మెట్రిక్ టన్ను లు, కర్ణాటకకు 1,91,288.07 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌ఘడ్‌కు 60,640.38 మెట్రిక్ టన్నులు, తమిళనాడు కు 1,01,520.99 మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 మెట్రిక్ టన్నుల యూరియాను వేప పూతతో సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.510 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు పేర్కొన్నారు. సంస్థ పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యం 11,94,921.17 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధనకు కీలక పాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు, అధికాకులకు, సంస్థకు మద్దతుగా నిలిచిన రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి, కేంద్ర ఎరువుల రసాయనాల మంత్రిత్వశాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు

కోల్‌సిటీ, ఏప్రిల్ 1: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ సమస్యలపై ప్రజలు కార్యాలయాకి రావల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని, పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణ శ్రీ తెలిపారు. స్మార్ట్ ఫోన్‌లో ని ప్లే స్టోర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సిటిజన్ బడ్డీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 14420 కు కాల్ చేఉసి ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉందని పేర్కొన్నారు. అలాగే నగర పాలక సంస్థ కార్యాలయంలోని కాల్ సెంటర్‌కు నేరుగా టోల్ ఫ్రీ నం.18004257062 లేదా ఫోన్ నం.9603666444, 9392483959కు ఫోన్ చేస్తే ఫిర్యాదు స్వీకరించి నమోదు చేస్తామని వివరించారు రామగుండం నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తీరిన తాగునీటి సమస్య

రఘువీర్‌సింగ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

జూలపల్లి, ఏప్రిల్ 1 : తేలుకుంటలోని రామాలయంలో భక్తుల తాగునీటి సమస్య తీరింది. అప్పటి బీఆర్ఎస్ పాలనలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేతి పంపు నిర్మించారు. ఈ క్రమంలో 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున రూ. 30 వేలు ఖర్చు చేసి కరెంట్ మోటర్ బిగించారు. ఈ సందర్భంగా రఘువీర్‌సింగ్ గ్రామస్తులతో కలిసి మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. మంచినీటి సమస్య తీర్చిన రఘువీర్‌సింగ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు శాలువాలు కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటగిరి శంకర్, గుడిపెల్లి శాంతికిరణ్, మారం శ్రీనివాస్, అడ్డగుంట నర్సయ్య, లాక్కాకుల శ్రీనివాస్, చొప్పరి శేఖర్, చిగురు రవీందర్‌రెడ్డి, చొప్పరి నర్సింగం, మడ్డి శ్రీనివాస్, నల్లాల స్వామి, చిప్ప శ్రీకాంత్, శ్రీరాములు అంజయ్య, నేవూరి శ్రీనివాస్, సదయ్య, బొద్దుల సంతోశ్, గ్యాజంగి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మంథని రూరల్, ఏప్రిల్1: ప్రభుత్వ దవాఖాన్లలో వైద్యులు రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సూరయ్యపల్లి పంచాయతీ పరిధిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నూతనంగా గైనకాలజిస్టును నియమించినట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

72.50 శాతం ఆస్తి పన్ను వసూళ్లు

కోల్‌సిటీ, ఏప్రిల్ 1: ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రామగుండం బల్దియాలో 72.50 శాతం పన్నులు వసూలు అయినట్లు కమిషనర్ జే.అరుణ శ్రీ తెలిపారు. గత ఏడాది మార్చి 31 నాటికి 55.58 శాతం మాత్రమే వసూలైనట్లు వివరించారు . 90 శాతం వడ్డీ మినహాయింపు ప్రకటనతో మరింత పన్నులు వసూళ్లయ్యాయని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్1: కూనారం మాజీ సర్పంచ్ బొట్కు రాజమల్లమ్మ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఇక్కడ మాజీ బీఆర్ఎస్ నాయకులు బొట్కు రవీందర్, బొట్కు కుమారస్వామి, కొల్లూరి రాజమల్లు, కొట్టె సమ్మయ్య, గీట్ల సుధాకర్‌రెడ్డి, బోడకుంట్ల తిరుపతి, గొర్ల సంతోశ్‌కుమార్, కుంభం రాజు, మంతెన రాజయ్య, గూళ్ల అశోక్, దుమ్మని సతీశ్, కండె శ్రీశైలం, బందెల శంకర్, పవన్, రవికుమార్ ఉన్నారు.

బ్యాండ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 1: ప్రభుత్వం బ్రాస్ బ్యాండ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనుగాల రాజయ్య అన్నారు. బ్రాస్ బ్యాండ్ వర్కర్ల మహాసభలు ఈనెల 8న సుల్తానాబాద్ లో జరుగుతున్న సందర్భంగా మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి సాహెబ్‌హుస్సేన్, ఎండి భాషుమియా, కన్నూరి రాజయ్య, పాల ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

- కేంద్రం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక నాయకులు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: దండకారణ్యంలోని ఖనిజ సంపదను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించాలనే లక్ష్యంతో బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ, అమిత్ షా క్రూరంగా ఆపరేషన్ ఆగార్ పేరుతో ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్నారని, వెంటనే ఆపరేషన్ కగార్ ఆపాలని ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక నాయకులు ముడిమడుగుల మల్లయ్య, జిన్నం ప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. దేశంలోని దండకారణ్యం అటవీ సంపదను కొల్లగొట్టి కొద్ది మంది కార్పొరేట్ వ్యక్తులకు విలువైన ఖనిజ సంపదను ధారాదత్తం చేసేందుకు కేంద్రప్రభుత్వం మానవ హననం సృష్టిస్తున్నదని ఆరోపించారు. దండకారణ్యంలోని ఆదివాసీ పసి పిల్లల నుంచి వృద్ధుల దాకా అనేక రకలుగా చిత్ర హింసలు పెడుతున్నాని ఆరోపించారు. ఆదివాసీలు అడవిని ఖాళీ చేసేలా కేంద్రం క్రూరంగా వ్యహరిస్తున్నదని మండపడ్డారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులు ఆపాలని, దండకారణ్యంలో ఖనిజ సంపదను దేశంలోని మేథావులు, కవులు, రచయితలు, జర్నలిస్టులు ఆపేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక నాయకులు రామిల్ల బాపు, ఎరుకల రాజయ్య, వెల్పూరు సదానందం, బాలసాని రాజయ్య, శ్రీపతి రాజగోపాల్, తాళ్లపల్లి లక్ష్మణ్, గాండ్ల మల్లేశ్, గుమ్మడి కొమురయ్య, జూపాక శ్రీనివాస్, కొంతం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో 15,037 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

- తెలంగాణ ప్రాజెక్టులో 10,504 మిలియన్ యూనిట్లు

జ్యోతినగర్, ఏప్రిల్ 1 : 2600 మెగా వాట్ల రామగుండం ఎన్టీపీసీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15,037 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తితో 62.02 పీఎల్ఎఫ్ శాతం నమోదైంది. ఎన్టీపీసీలోని 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్‌లో 2024–25కు గాను 10,504 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి నమోదుతో 74.94 శాతం పీఎల్ఎఫ్ సాధించింది. గడిచిన మార్చి నెలలో 1,012.38 మిలియన్ యూనిట్లతో 85.05 శాతం పీఎల్ఎఫ్ నమోదైంది. వార్షిక సంవత్సరానికి యాజమాన్యం నిర్దేశించిన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు చేరుకోలేకపోయాయి. కాగా, 2600 మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ గతేడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభం నెల ఏప్రిల్ 4న ఒక్క రోజు ప్లాంటులో 94.86 శాతం పీఎల్ఎఫ్ నమోదవడం గమన్హారం. అలాగే, ప్లాంటులోని 500 మెగావాట్ల నాలుగో యూనిట్ ఎలాంటి అంతరాయం లేకుండా ఏకధాటిగా 280 రోజుల పాటు విద్యుదుత్పత్తి చేసి ఎన్టీపీసీ వ్యాప్తంగా 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లలోని యూనిట్లలో సరికొత్త రికార్డు నమోదు చేసుకుంది.

పని వేళలు మార్చాలి

యైటింక్లయిన్ కాలనీ, ఏప్రిల్ 1: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు అశోక్ కోరారు. ఈమేరకు ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

5న పుట్ట నారాయణ వర్ధంతి సభ

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన పుట్ట నారాయణ 47వ వర్ధంతి సభ ఈనెల 5న గోదావరిఖనిలోని స్నేహ సాహితి గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి తెలిపారు. సభకు సింగణి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వర్ధంతి సభ కర పత్రాలు విడుదల చేశారు. 1978లో బంద్ సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ మృతి చెందాడని గుర్తు చేశారు. అప్పటి పాలకులు ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చి 47 యేండ్లు గడిచినా ఆ కుటుంబాన్ని ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పుట్ట నారాయణ విగ్రహాన్ని ముస్త్యాలలో ఏర్పాటు చేయాలని, ఆకుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు శ్రీపతి రాజగోపాల్, పుట్ట రాజన్న, బాలసాని రాజయ్య, బొంకూరి లక్ష్మణ్, సత్యనారాయణ, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

భూ వివాదాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: రౌడీ సీట్ నమోదైన వ్యక్తులు భూ వివాదాల్లో తల దూర్చకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని పెద్దపల్లి డీసీపీ పీ కరుణాకర్ తెలిపారు. పెద్దపల్లి ఏసీపీ కార్యాలంలో రౌడీ షీట్ నమోదైన వ్యక్తులకు మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భం గా డీసీపీ మాట్లాడారు. పోలీసుల ఆదేశాలు బేఖాతరు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇక్కడ ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణరావు, మల్లేశ్, లక్ష్మణ్, స్వామి, సిబ్బంది ఉన్నారు.

అధికారుల సందర్శన

ఎలిగేడు, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించబోయే పోలీస్‌స్టేషన్ పెద్దపెల్లి డీసీపీ ,ఏసీపి గజ్జి కృష్ణ సందర్శించారు. నేమ్ బోర్డు ఏర్పాటు,పోలీస్‌స్టేషన్‌లో వివిద రకాల గదుల ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. త్వరలో ఠాణాను ప్రారంభిస్తామని డీసీపీ కరుణాకర్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వకు గండి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 1: మడిపల్లి కాలనీ వద్ద 43ఎల్ కాల్వకు గండిపెట్టడంతో నీళ్లన్నీ పంట పొలాల మీదుగా వృధాగా పోతున్నాయని భీమారంపల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెగడపల్లి సబ్‌స్టేషన్ నుంచి వచ్చే కాల్వకు మడిపల్లి కాలనీ వద్ద ఓ చేపల కాంట్రాక్టర్ గండిపెట్టాడని, దీని వల్ల నీళ్లు చివరి ఆయకట్టు రైతులకు అందకుండా వృధాగా పోతున్నాయని రైతులు చిట్టంపల్లి చెంద్రయ్య, అశోక్ , లక్ష్మయ్య, కనుకయ్య ఆరోపించారు.ఈ విషయమై ఎస్సారెస్పీ అధికారులకు సమాచా రం ఇచ్చామని అన్నారు. పంటలో నీళ్లన్నీ నిలవడంవల్ల కోత దశలో పొలం పూర్తిగా దెబ్బతిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి సదరు కాంట్రాక్టర్ పై చట్టపరంగా చర్య తీసుకొని, కాల్వ గండి పూడ్చివేయాలని పలువురు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బాలుర ఉన్నత పాఠశాల ఎదుట కూల్చేస్తున్న పాత కట్టడం

చెదిరిపోయిన తీపి జ్ఞాపకం

జూలపల్లి, ఏప్రిల్ 1 : జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆనాటి పాత కట్టడం, ఇనుప గేటును అభివృద్ధి పనుల పేరుతో చెరిపేశారు. ఆనాటి ఆనవాళ్లు కనుమరుగు కావడంతో పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. 1952లో అప్పటి ప్రభుత్వం పాఠశాలను ఏర్పాటు చేసింది. దాదాపు 70 ఏండ్ల కిందట జెండా గద్దెలను ఆనుకొని ప్రహరీతో పాటు గేటు, చుట్టూ ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇటీవల పాఠశాల ముందు, వెనక, కుడి వైపు దాదాపు 225 మీటర్ల కొత్త గోడ నిర్మాణం, రెండు గేట్లు ఏర్పాటు చేయడానికి సర్వ శిక్ష పథకం కింద రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో సదరు గుత్తేదారు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. చెక్కు చెదరని పాత కట్టడం తొలగించడాన్ని పూర్వ విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ముందస్తు అరెస్టులు

జ్యోతినగర్, మార్చి 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమి అమ్మకాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో మంగళవారం అన్ని విద్యార్థి సంఘాలు తలపెట్టిన ధర్నా నేపథ్యంలో ముందస్తుగా ఎన్టీపీసీ పోలీసులు ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. సీపీఎం నాయకులు నాంసాని శంకర్, ఎం రామాచారి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చిలుక శంకర్‌ను ఇంటి వరద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వదిలిపెట్టారు.

'ఖని' వాకర్స్ ఔదార్యం

కోల్‌సిటీ, ఏప్రిల్ 1: గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ తమ ఔదార్యం చాటుకున్నారు. తోటి వాకర్, యోగా శిక్షకుడు అల్లం రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. తోటి వాకర్స్ అంతా కలిసి రూ.26వేలను మంగళవారం జేఎల్ఎన్ స్టేడియంలో రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు జంగాల సురేందర్ ఉద్యోగ విరమణ పొందగా అతడిని సన్మానించారు. స్వచ్ఛంద సంఘాల సలహా దారు దయానంద్ గాంధీ, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

ధర్మారం,ఏప్రిల్1: బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ పోస్టర్లను ధర్మారంలో విడుదల చేశారు. సభకు బ్రాస్‌బ్యాండ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ మండలాధ్యక్షుడు ఏదుల్ల అంజయ్య, నాయకులు ఎండీ షరీఫ్, బిరుదుల మల్లయ్య, గోలాడ స్వామి,మోహన్ నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

CHANGE OF NAME
నేను కొల్లూరి వసంత, పాస్‌పోర్ట్ నెం: V5844545 కలిగి ఉన్నాను, తెలంగాణలోని చెల్గల్, జగిత్యాల, H.No. 5-11/1లో నివసిస్తున్న తరాల గణేష్ భార్యని, వివాహం తర్వాత నా ఇంటి పేరును మార్చుకున్నానని మరియు ఇకపై అన్ని అధికారిక మరియు చట్టపరమైన ప్రయోజనాల కోసం తరాల వసంత అని పిలువబడతానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను. సంబంధిత పత్రాలన్నీ ఈ మార్పును తదనుగుణంగా ప్రతిబింబిస్తాయి.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189